

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

సంపుటి : 4 | సంచిక : 88 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 09-10-2024 | పేజీలు : 5



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690


# ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్



- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్,
- అమరావతిని కలుపుతూ ఏర్పాటు
- దీనికోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్
- పూర్తి ప్రతిపాదనల తర్వాత ప్రకటన
- ఢిల్లీలో ఎంపీలకు వెల్లడించిన చంద్రబాబు


**అమరావతి, అక్టోబరు 8 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర రైల్వే శాఖ ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు.. రాష్ట్ర ఎంపీలకు ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వివిధ విషయాలపై మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి ఢిల్లీలో అందుబాటులో ఉన్న కొందరు కూటమి ఎంపీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన గురించి చెప్పారు. దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర ప్రభుత్వం ముంబై నుంచి అహ్మదాబాద్‌కు నడపాలని నిర్ణ యించింది. దీనికి సంబంధించిన పనులు వేగంగా నడుస్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు మార్గాల్లో ఈ హై స్పీడ్ రైళ్లను నడపాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. ఇందులో దక్షిణాదిలో రెండు మార్గాలు ఉన్నాయి. చెన్నై నుంచి బెంగళూరు మీదుగా మైసూరు వరకూ ఒక ట్రైన్, ముంబాయి నుంచి హైదరాబాద్‌కు మరో ట్రైన్‌ను ఇందులో ప్రతిపాదించారు. మొదటి దశ ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్ లేదు. కాని తాజాగా ఏపీని కూడా ఇందులో చేర్చినట్లు ముఖ్యమంత్రి.. ఎంపీలకు తెలిపారు. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతి నగరాలు కలిసేలా బుల్లెట్ రైళ్లు నడపడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయని ఆయన చెప్పారు. దీని కోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్ వేయాల్సి ఉంటుందని, పూర్తి ప్రతిపాదనలు సిద్ధమైన తర్వాత రైల్వే శాఖ వివరాలు వెల్లడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**రామాయపట్నంపై బీపీసీఎల్ మొగ్గు**

రూ.అరవై వేల కోట్ల పెట్టుబడితో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న భారత్ పెట్రోలియం కంపెనీ... రామాయపట్నంపై మొగ్గు చూపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎంపీలకు తెలిపారు. ఈ కంపెనీ తన రిఫైనరీ ఏర్పాటుకు మూడు రాష్ట్రాలను పరిశీలించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకొంది. ఏపీలో మూడు ప్రాంతాలను ఆ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపాడు (శ్రీకాకుళం) పోర్టు ప్రాంతాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మూడు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ఆ కంపెనీ....రామాయపట్నం వైపు మొగ్గు చూపుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రామాయపట్నం నెల్లూరు జిల్లాలో కందుకూరు ప్రాంతంలో ఉంది. వెయ్యి ఎకరాల్లో రూ. అరవై వేల కోట్ల పెట్టుబడితో వచ్చే ఈ రిఫైనరీ ఆ ప్రాంత స్వరూపాన్ని మార్చివేసే అవకాశాలు ఉన్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుకు మచిలీపట్నం పోర్టు ప్రాంతాన్ని ఎంపిక చేసే అవకాశాలు పరిశీలించాలని బందరు ఎంపీ బాలశౌరి ఈ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరారు. బీపీసీఎల్ తనకు నచ్చిన ప్రాంతాన్ని తాను ఎంపిక చేసుకొంటుందని ముఖ్యమంత్రి ఆయనకు చెప్పారు.

**గ్రీన్ హైడ్రోజన్‌లో లక్ష కోట్ల పెట్టుబడి**

విశాఖపట్నం ప్రాంతంలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు రాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు వస్తోందని, దేశంలోనే ఇది అతి పెద్ద ప్రాజెక్టని ఆయన వెల్లడించారు. పునరుత్పాదక ఇంధనాల్లో ఇది కొత్త తరం టెక్నాలజీకి సంబంధించిందని, ఇక్కడ ఉత్పత్తి అయిన గ్రీన్ హైడ్రోజన్‌ను ఎగుమతి చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయని ఆయన ఎంపీలకు చెప్పారు.




# ఆంధ్రాకు అభయం





- అన్ని విధాలా సహకారం అందిస్తాం..
- బాబుకు మోదీ హామీ
- స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను.
- జగన్ హయాంలో అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం
- పూర్తిగా కోలుకునేందుకు కేంద్రం మద్దతు కావాలి
- స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు అన్నివిధాలా చర్యలు
- రెండేళ్లలో పోలవరం, భోగాపురం విమానాశ్రయం
- డిసెంబరు నుంచి రాజధాని పనులు వేగవంతం
- రెండోరోజు అమిత్ షా, నిర్మల, గడ్కరీ, పీయూష్,
- కుమారస్వామి, హర్దీప్‌సింగ్‌తో సీఎం చర్చలు
- మీడియాకు వివరాలు వెల్లడించిన చంద్రబాబు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8 (జనస్వరం) :** గత ఐదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాల వల్ల అతలాకుతలమైన ఏపీ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు కేంద్రం అన్ని విధాలా సహకరించాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏపీ ఆర్థికంగా పూర్తిగా కోలుకునేందుకు అవసరమైన మద్దతు అందిస్తానని ప్రధాని హామీ ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను మంజూరు చేయాలని, అమరావతి రాజధానిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, పీఎంయూవై కింద కేటాయింపులను పెంచాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ మరో రెండేళ్లలో పూర్తవుతుందని, ఇందుకోసం కేంద్రం రూ.12,500 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభమవుతుందని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) నుంచి రూ.15 వేల కోట్లు త్వరలో మంజూరు కానున్నాయని తెలిపారు. రాజధాని పనులు డిసెంబరు నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించకుండా అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశాఖ ఉక్కును తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా అభివర్ణించారు. మరో రెండేళ్లలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెసవేను నాలుగు నుంచి ఎనిమిది లేన్లకు పెంచాలని, హైదరాబాద్ నుంచి అమరావతికి మరో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను ప్రతిపాదించినట్లు తెలిపారు. మచిలీపట్నం రేవును తెలంగాణకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. భోగాపురంలోనే సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ మరో రెండేళ్లలో ఏర్పడుతుందని తెలిపారు. బీపీసీఎల్ రిఫైనరీని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కమిటీ నిర్ణయిస్తుందని, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నంతో సహా నాలుగు ప్రాంతాలు పరిశీలనలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. తన రెండ్రోజుల ఢిల్లీ పర్యటనపై మంగళవారం సాయంత్రం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

**వారసత్వంగా చెత్త మిగిల్చాడు**

"జగన్ ఆర్థిక అకృత్యాల వల్ల అడుగడుగునా ఏపీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానికి వివరించాను. స్వచ్ఛభారత్ పథకాన్ని కూడా జగన్ నీరుగార్చారు. వారసత్వంగా ఆయన 85 లక్షల టన్నుల చెత్తను మిగిల్చిపోయారు. జగన్ హయాంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్ది 2047 వరకు ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దే దిశలో లక్ష్యాన్ని ప్రధానికి వివరించాను. జగన్ సర్కారు కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చెయ్యలేదు. ఏ మంత్రిత్వ శాఖకు వెళ్లి నిధులు అడిగినా యూటిలిటీ సర్టిఫికెట్లు (యూసీ)లు అడుగుతున్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులతో సహా కేంద్రం తలపెట్టిన ఏ ప్రాజెక్టుకూ జగన్ ప్రభుత్వం భూమి కేటాయించలేదు. మ్యాచింగ్ గ్రాంట్లను కూడా విడుదల చేయలేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ. 10.50 లక్షల కోట్లు అప్పు చేసింది. ఎఫ్ఆర్‌బీఎం కింద కూడా అప్పులు చేసే పరిస్థితి లేదు"

**పంచాయతీరాజ్‌ను నాశనం చేశారు**

"రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను నాడు నాశనం చేశారు. ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను కూడా ఇవ్వలేదు. ఉపాధి హామీ డబ్బులను నాటి వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. విశాఖపట్నం రైల్వే జోన్‌కు కూడా గత ప్రభుత్వం భూమి కేటాయించలేదు. మేం అధికారంలోకి రాగానే కేంద్రాన్ని సంప్రదించి అనువైన భూమిని కేటాయించాం. డిసెంబరులో ప్రధాని చేతుల మీదుగా రైల్వేజోన్ ప్రారంభమవుతుంది"


**స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమగ్ర ప్యాకేజీ**

"విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా శాయశక్తులా నేను ప్రయత్నిస్తున్నాను. కేంద్రం కూడా సహకరించడానికి సిద్ధంగా ఉంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, మనోభావాలకు సంబంధించిన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి సమగ్ర ప్యాకేజీ అవసరం. స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారంలో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నాం. పరిపాలన వైఫల్యం, కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల స్టీల్ ప్లాంట్ ఇబ్బందులలో పడింది. స్టీల్ ప్లాంట్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక పరిష్కార విధానం. అయితే అందుకు సెయిల్, కేంద్రప్రభుత్వం ఒప్పుకోవాల్సి ఉంటుంది. సాధుకొండ, ఎర్రకొండ, గడ్చిరోలిలో ఐరన్ ఓర్ ఉంది. సెయిల్ మాదిరి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఐరన్ ఓర్‌ను కేటాయిస్తే ప్రధాన సమస్య పరిష్కారమవుతుంది. స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన జటిల సమస్యలపై కేంద్ర ఉక్కు మంత్రి జేడీ కుమారస్వామితో చర్చించాను"

**స్కీమ్‌లకు ఏఐ సంధానం..**

"రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి ప్రభుత్వ పథకాలు రియల్‌టైంలో ప్రజలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా విద్యార్థుల భవిష్యత్తుకు, ప్రజల ఆరోగ్య రికార్డులను నమోదు చేసేందుకు, ప్రభుత్వ పనితీరును మెరుగుపర్చేందుకు ఈ టెక్నాలజీని వినియోగించనున్నాం. ఏపీలో ఐటీ నైపుణ్యం, డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు జాతీయ ఎలక్ట్రానిక్స్ సమాచార సంస్థను నెలకొల్పాలని నేను చేసిన ప్రతిపాదనను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అంగీకరించారు. ఏపీని సెమీకండక్టర్ పరిశ్రమలకు కేంద్రంగా మార్చాలని నేను కోరాను. వాల్తేరు డివిజన్‌ను యథాతథంగా కొనసాగిస్తూ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయడంపై అశ్వినీ వైష్ణవ్‌తో వివరంగా చర్చించాను. రెండేళ్లలో విశాఖ నుంచి అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటవుతోంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అమరావతి మధ్య హైస్పీడ్ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేయడం, బుల్లెట్ ట్రైన్లను ప్రవేశపెట్టడంపై చర్చించాం. మచిలీపట్నం నుంచి అమరావతి మధ్య, నరసాపూర్- మచిలీపట్నం, రేపల్లె- బాపట్ల మధ్య కొత్త రైల్వే లైన్లు మంజూరు చేయాలని కోరాను" అని చంద్రబాబు తెలిపారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 09 అక్టోబర్ 2024,**
**తిథి :** శుద్ధ షష్ఠి (ఉ.07:47వ.కు)
**నక్షత్రం :** మూల (పూర్తి వ.కు), శోభన (10తా తె.01:23 వ.కు)
**బ్రహ్మ ముహూర్తం :** తె.05:43ల తె.06:31,
**రాహుకాలం :** మ.12:46ల నుండి మ.02:08,
**యమగండం :** ఉ.08:41ల నుండి ఉ.10:03,
**వర్జ్యకాలం :** రా.11:07, 10తా తె.00:59

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 09 అక్టోబర్ 2024**
**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:57
**సూర్యోదయం :** ఉదయం గం. 06:07
**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:04
**అసర్ :** సాయంత్రం గం. 03:26
**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 05:59
**ఇష :** రాత్రి గం. 07:11





**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# నేడు ప్రపంచ తపాలా దినోత్సవం

**ఇన్నోవేషన్, ఇంటిగ్రేషన్ మరియు ఇన్‌క్లూజన్**

1874లో స్విస్ రాజధాని బెర్న్‌లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న ప్రపంచ తపాలా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1969లో జపాన్‌లోని టోక్యోలో జరిగిన యూపీయూ కాంగ్రెస్ దీనిని ప్రపంచ తపాలా దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుండి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు వేడుకల్లో ఏటా పాల్గొంటాయి. అనేక దేశాల్లోని పోస్ట్‌లు కొత్త పోస్టల్ ఉత్పత్తులు, సేవలను పరిచయం చేయడానికి లేదా ప్రచారం చేయడానికి ఈవెంట్‌ను ఉపయోగిస్తాయి. 2015లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా కలిసి పని చేసేందుకు కట్టుబడి ఉన్నాయి. ఇది తీవ్రమైన పేదరికం, ఆకలిని అంతం చేయడం, అసమానత మరియు అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడడం, వాతావరణ మార్పులను తిప్పికొట్టడానికి చర్యలు తీసుకోవడం – ఈ 17లో కొన్నింటికి మాత్రమే కొత్తగా అంగీకరించబడింది. లక్ష్యాలు. ఈ గ్లోబల్ ప్రయత్నంలో తన వంతు పాత్రను పోషిస్తూ, అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలను అందించడం ద్వారా పోస్ట్ ఈరోజు గతంలో కంటే మరింత సంబంధిత పాత్రను కలిగి ఉంది.

**2024 థీమ్ : 150 సంవత్సరాల కమ్యూనికేషన్‌ను ప్రారంభించడం, దేశవ్యాప్తంగా ప్రజలను సాధికారత చేయడం**

2024లో, యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (UPU) తన 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంది. "150 సంవత్సరాల కమ్యూనికేషన్‌ను ప్రారంభించడం, దేశాల అంతటా ప్రజలకు సాధికారత కల్పించడం" అనే థీమ్‌తో, ఈ సంవత్సరం ప్రపంచ తపాలా దినోత్సవం UPU యొక్క దీర్ఘకాల విజయాలను గుర్తిస్తుంది. రాబోయే దశాబ్దాలు, శతాబ్దాల పాటు ప్రజలందరికీ సేవ చేయాలనే దాని నిబద్ధతను బలపరుస్తుంది. మేము 150 సంవత్సరాల పురోగతిని ప్రతిబింబిస్తూ, శాంతి, శ్రేయస్సు, ప్రపంచ అవగాహన కోసం కమ్యూనికేషన్ చోదక శక్తిగా ఉండే భవిష్యత్తు వైపు చూస్తున్నప్పుడు ఈ చారిత్రాత్మక మైలురాయి వేడుకలో పాల్గొనండి. వరల్డ్ పోస్ట్ డే, UPU 150




**నేపథ్యం**

ప్రపంచ తపాలా దినోత్సవం ఉద్దేశ్యం ప్రజల, వ్యాపారాల రోజువారీ జీవితంలో పోస్టల్ రంగం పాత్ర, దేశాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దాని సహకారం గురించి అవగాహన కల్పించడం. ఈ వేడుక సభ్య దేశాలు తమ పోస్ట్ పాత్ర, కార్యకలాపాలపై జాతీయ స్థాయిలో ప్రజల్లో, మీడియాలో విస్తృత అవగాహనను కల్పించే లక్ష్యంతో కార్యక్రమ కార్యకలాపాలను

## ఎడిటోరియల్

చేపట్టమని ప్రోత్సహిస్తుంది. ప్రతి సంవత్సరం, 150 కంటే ఎక్కువ దేశాలు ప్రపంచ తపాలా దినోత్సవాన్ని వివిధ మార్గాల్లో జరుపుకుంటాయి. కొన్ని దేశాలలో, ప్రపంచ తపాలా దినోత్సవాన్ని వర్కింగ్ హాలిడేగా పాటిస్తారు. అనేక పోస్ట్‌లు కొత్త పోస్టల్ ఉత్పత్తులు మరియు సేవలను పరిచయం చేయడానికి లేదా ప్రచారం చేయడానికి ఈవెంట్‌ను ఉపయోగిస్తాయి. కొన్ని పోస్ట్‌లు తమ ఉద్యోగులకు మంచి సేవ కోసం రివార్డ్ ఇవ్వడానికి ప్రపంచ పోస్ట్ డేని కూడా ఉపయోగిస్తాయి. అనేక దేశాల్లో, ఫిలాటెలిక్ ప్రదర్శనలు నిర్వహించబడతాయి. కొత్త స్టాంపులు, తేదీ రద్దు గుర్తులు జారీ చేయబడతాయి. ఇతర కార్యకలాపాలలో పోస్టాఫీసులు, ఇతర బహిరంగ ప్రదేశాలలో ప్రపంచ తపాలా దినోత్సవ పోస్టర్ల ప్రదర్శన, పోస్టాఫీసులు, మెయిల్ సెంటర్లు, పోస్టల్ మ్యూజియంలలో బహిరంగ రోజులు, సమావేశాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అలాగే సాంస్కృతిక, క్రీడ, ఇతర వినోద కార్యకలాపాలు ఉన్నాయి. అనేక పోస్టల్ అడ్మినిస్ట్రేషన్‌లు టీ–షర్టులు, బ్యాడ్జ్‌ల వంటి ప్రత్యేక సావనీర్‌లను జారీ చేస్తాయి. UPU ఇంటర్నేషనల్ లెటర్–రైటింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనే దేశాలకు, జాతీయ విజేతలను తరచుగా అక్టోబర్ 9న సత్కరిస్తారు.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## ప్రకృతి వరం.. మధురఫలం.. సీతాఫలం



**పులివెందుల, అక్టోబర్ 8 (జనస్వరం) :** ప్రకృతి పరంగా లభించే వల్ల ఆరోగ్యం ఎంతో శ్రేయస్కరంగా ఉంటుంది.. సీజన్ పరంగా వచ్చే పండ్లను తినడం వల్ల ఆరోగ్యం కూడా ఉదుటపడుతుంది. సీజన్ పరంగా వచ్చే పండ్లలో సీతాఫలం ఒకటి వీటిని మధుర ఫలంగా ప్రకృతి పరంగా ప్రజలు భావిస్తారు. ప్రస్తుతం సీజన్ రావడంతో అవి మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. మామిడి, రేగుపండ్లు, గంగిరేగుపండ్లు, నేరేడు, తాటి ముంజలు వీటితోపాటు సీతాఫలం సీజన్ పరంగా వస్తుంది. సీతా పండ్లను చూస్తే ప్రతి ఒక్కరికి నోరూరిస్తుంది. సీతాఫలం మంచి రుచికరమైన పదార్థం వీటిలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది విటమిన్ సి కూడా సమృద్ధిగా దొరుకుతుంది. ఆహారం తేలిగ్గా జీర్ణం అయ్యేందుకు దీనిలో ఉన్న పీచు పదార్థం ఎంతో తోడ్పడుతుంది అంతే కాకుండా అల్సర్లను నయం చేస్తుంది. వీటిలో అనేక సూక్ష్మ పోషకాలు ఉన్నందున ఆరోగ్యానికి మిక్కిలి దోహదపడతాయి. భారత దేశంలో సీతాఫల్ అనే ఈ రుచికరమైన ఉష్ణ మండల పండు ప్రత్యేకమైన రుచి కంటే ఎక్కువ అందిస్తుంది. అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడా లోడ్ చేయబడుతుంది. గొప్ప పోషక విలువలు భిన్న ఉపయోగాలు సంభావ్య దుష్ప్రభావాలపై వెలుగునిస్తుంది. సీతాఫలం అనేక ప్రయోజనాలు కల్పిస్తుంది. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడానికి పోషక విలువలు కలిగిన వాటిలో సీతాఫలం ఒకటి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. సీతాఫలం లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. సీతాఫలం పండులో అధిక ఫైబర్ కంటెంట్ ఉంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణాశయంలోని బ్యాక్టీరియాను పోషించడంలో సహాయపడుతుంది. సీతఫలంలో ఉండే బి సిక్స్ మానసిక స్థితిని అంతరించడంలో సహాయపడుతుంది. అలాగే సీతాఫలంలోని పొటాషియం మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. ఆరోగ్యానికి రెండు ఖనిజాలు పొటాషియం సోడియం సమతుల్యం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇలా ఎన్నో ప్రయోజనాలు కలిగిన సీతాఫలం సాగు పరంగా కూడా రైతులకు ఎంతో ఉపకరిస్తుంది. ఇలాంటి ప్రాయోజిత సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆరోగ్య కార్యకర్తలకు టార్చ్ లైట్‌లు పంపిణీ




**పులివెందుల, అక్టోబర్ 8 (జనస్వరం) :** అర్బన్ పరిధిలోని బాకరాపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే మీటింగ్ సందర్భంగా దోమ లార్వాను గుర్తించుట కొరకు ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంత కుమార్ ఆధ్వర్యంలో సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంత కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి ఇంటి లోపల నీరు నిల్వాలుంచిన పాత్రాలలో టార్చ్ లైట్‌ను ఉపయోగించి లార్వాను గుర్తించాలని, ఒక వేళ లార్వా ఉన్నట్లు అయితే ఆ నీటిని తొలగించడం కానీ లేక అబేట్ పిచికారి చేయాలని డాక్టర్ శాంత కుమార్ అన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త తప్పని సరిగా ప్రతి గృహాన్ని సందర్శించి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలని, ఇంటిలోని ఇంటి వెలుపల ఉన్న నీటి తొట్లు, నీటి డ్రమ్ములకు మూతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమను లార్వా దశలోనే అంతం చేయాలని, దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడు వాపు వ్యాధి, బోధకాలు వంటి వ్యాధులు వస్తాయని, ప్రజలకు తెలియజేసి జ్వరం వచ్చిన వారికీ మలేరియా డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని సిద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద పరిహారంపై వైసీపీ కుట్ర రాజకీయాలు చేస్తుంది

### టీడీపీ నాయకులు



**విజయవాడ, అక్టోబర్ 8 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం వరద బాధితులకు, రైతులకు పరిహారాన్ని శరవేగంతో వారి ఖాతాల్లో జమ అయ్యేలా చేసిందని, పరిహారంపై వైసీపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతుందని, జగన్‌లా ఉత్తుత్తి బటన్ నొక్కలేదని స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, గద్దె రామమోహన్, బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వం తరపున ఇచ్చే సాయం బాధితులకు అందడానికి నెలల తరబడి సమయం పట్టేదని, సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో వరద బాధితులకు శరవేగంగా పరిహారం అందిందని, బుడమేరు వరదలకు కారణం జగన్ మోహన్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారానికి బాధితులంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే జగన్‌రెడ్డి మాత్రమే కుట్ర రాజకీయాలకు తెరలేపుతుందన్నారు. విజయవాడకు వరదలు వచ్చింది ఆగస్టు 30, పరిహారం సెప్టెంబర్ 17న.. 98శాతం అంటే 2,72,000 కుటుంబాలకు పరిహారం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు. వర్షాలకు రాష్ట్రంలో 6,800 కోట్ల మేర ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భారీగా నష్టం జరిగిందని, చంద్రబాబు ఇంటికి కూడా వెళ్లకుండా 11 రోజుల పాటు కలెక్టరేట్‌లోనే ఉంటూ ప్రతి ఒక్కరికీ సాయమందేలా చూశారని కొనియాడారు. వరదల్లో చనిపోయిన వారికి ప్రతీ కుటుంబానికి 48 గంటలు గడవకముందే 5లక్షల పరిహారం ఇచ్చింది కూటమి ప్రభుత్వమే. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, 6 రకాల నిత్యావసరాల కూడిన కిట్లు ప్రతి వరద బాధిత కుటుంబానికి అందజేశామన్నారు. ఈ రకంగా అందరినీ ఆదుకుంటే మంచినీళ్లకు ఇన్నయ్యాయా, భోజనం ప్యాకెట్లు అన్నయ్యాయా, 13లక్షల మంది ప్రజలు వరద ప్రాంతాల్లో చిక్కుకుంటే ఒక్కో మనిషికి మీరు చెప్పిన దాని ప్రకారం అరలీటరు వాటర్, భోజనం ప్యాకెట్ ఒక్కటే ఇవ్వాలని జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశిస్తున్నట్లు సాక్షి పత్రికలో ముంపులో మేసేశారని కథనం వేసుకున్నారు. చంద్రబాబు లక్ష్యం.. ఒక్క భోజనం ప్యాకెట్ వృధా పోయిన పర్వాలేదు వరద ప్రాంత బాధితుల్లో ఒక్క వ్యక్తి కూడా ఆకలితో ఉండకూడదని, అందర్నీ ఆదుకోవాలని, బిడ్డలు ఆకలితో ఉండకూడదని, వారికి పాలివ్వాలని, వారు కలుషిత నీటితో మరణించకూడదని, అవస్థలు పడకూడదని అందరికీ మంచినీళ్ల బాటిల్స్ ఇస్తే మీరు ఒక్క సహాయం చేయకుండా కనీసం సాక్షి పత్రికలో ప్రజలకు అండగా నిలవాలని పాఠకులకు పిలుపు కూడా ఇవ్వలేకపోయారు, గత ప్రభుత్వంలో ఐదేళ్లు అన్నీ కాంట్రాక్టులు తీసుకుని ప్రకృతి సహజ సంపదలను దోచుకుని, గనులన్నీ దోచుకున్న వాళ్లు ఒక్కడు కూడా సీఎం సహాయ నిధికి డబ్బులివ్వకపోవడం దురదృష్టకరం, మీరు చేసిన తప్పులను మొదట సరిచేసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డికి, వైసీపీ నాయకులకు హితవు పలికారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కృష్ణా నదికి 8సార్లు వరద వచ్చింది, ఆ రోజు సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్కసారిగా కూడా వచ్చి పరామర్శించలేదు, అంతేకాదు నష్టపోయిన ఏ వ్యక్తికి డబ్బులిచ్చే కార్యక్రమం కూడా చేయలేదు. మేన్ మేడ్ డిజ్జార్‌లో ఉన్న మేన్ జగన్‌మోహన్ రెడ్డేనని, ప్రకాశం బ్యారేజీని పడవలతో ధ్వంసం చేసి లక్షలాది మందిని హతమార్చడానికి వైసీపీ నేతలు చేసిన కుట్రలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ప్రకాశం బ్యారేజి 68, 69 గేట్లను ధ్వంసం చేసిన 5 పడవల్లో 4 పడవలకు వైసీపీ రంగులుండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు, ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం తప్పిదమైతే పూర్తి చేసిన ప్రాజెక్టులను కూల్చి వేయాలనుకోవడం మరో తప్పిదమన్నారు. ప్రభుత్వం నగరంలో మూడు డివిజన్లకు ఒక మంత్రిని, ప్రతీ డివిజన్ ఒక ఎమ్మెల్యే వరద సహాయక చర్యలను పర్యవేక్షణకై నియమించిందని, వరద బాధిత కుటుంబాలను సత్వరమే ఆదుకునేలా చేయటమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కూటమి ప్రభుత్వం వరద బాధితులకు 98వాతం పరిహారం అందించిందని, సోమవారం మిగిలిన 2శాతం మందికి కూడా పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో లబ్ధిదారుల కాతాల్లో నగదు జమ చేస్తున్నామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటూ ఉత్తుత్తి బటన్‌లతో మోసం చేశారని గుర్తుచేశారు. వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి సాయం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు ఊహించేలా ఉండదు, ఒక్క రాత్రి కురిసిన వర్షంతోనే నాడు విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తాయి, గతంలో కూడా హుదుత్ తుపాన్ సందర్భంగా చంద్రబాబు విశాఖ వెళ్లి బస్సులో అక్కడే వుండి పూర్వస్థితికి తెచ్చారు. విజయవాడలో కూడా ప్రకృతి విపత్తు వల్ల కలిగిన నష్టాన్ని సాధారణ పరిస్థితి తెచ్చే విధంగా వారం రోజుల్లోనే విజయవాడ నగరంలో అన్నీ వ్యవస్థల్నీ కేంద్రీకరించి చంద్రబాబు ఇంటికి కూడా వెళ్లకుండా ప్రజల మధ్యే ఉంటూ సాయం అందేలా చూశారన్నారు. ఆఖరికి ఇళ్ల ముందు పేర్కొన్న బురదను కూడా తొలగించి అందరూ సంతోషంగా ఇళ్లలోకి వెళ్లిన తర్వాతనే చంద్రబాబు గారు ఇంటికి వెళ్లడం జరిగిందన్నారు. అందరూ బాగుంటే ఓర్చుకోలేని వ్యక్తి జగన్‌రెడ్డి, విపత్తులు వచ్చినప్పుడు ఆకాశంలో ప్రయాణం చేస్తా కింద జరిగిన నష్టాన్ని అంచనా వేసే వ్యక్తి, భూమ్మీద రాలేని వ్యక్తి అని విమర్శించారు. కానీ జగన్‌లా ఉత్తుత్తి బటన్ నొక్కలేదని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారానికి వరద బాధితులంతా సంతోషంగా ఉన్నారని, విపత్తు సమయాల్లో సాయంపై చంద్రన్నకు, జగన్‌కు భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ "నేను వరదల్లో ఫుడ్ కమిటీ మెంబర్‌గా ఉన్నాను, వరద ప్రభావిత కుటుంబాలకు సాయం చేయడానికి దాతలు ముందుకొచ్చారు, కానీ జగన్‌మోహన్‌రెడ్డితో సహా వైసీపీ తరపున పోటీచేసిన ఏ ఒక్కరూ సాయం చేయడానికి ముందుకు రాని పరిస్థితి. మీ సాక్షి పత్రికలో అధికార పక్షం బాగా చేసిందని, రాయలేకే ఇలా ముంపులో 534 కోట్లు బొక్కేశారని రాసి ప్రజల్ని పక్కదోవ పట్టించాలని చూస్తున్నారు. వైసీపీ హయాంలో వరదలతో రోడ్లు తెగిపోయినా, రాకపోకలు నిలిచిపోయినా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం గానీ, వారికి అవసరమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలనే ఆలోచన చేయలేదని, గోదావరి వరదలు వస్తే కుళ్లిపోయిన 3 టమోటాలు, 2 బంగాళా దుంపలిచ్చి బాధితులను గాలికొదిలేశారు, నిలదీస్తే కొన్నిచోట్ల కొంత మందికి మాత్రమే రూ.1000 ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.

## దసరా సంబరాలను విజయవంతం చేయండి




**పులివెందుల, అక్టోబర్ 8 (జనస్వరం) :** పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఈ నెల 11 నుంచి 13 వ తేదీ వరకు వహించనున్న దసరా సంబరాలను విజయవంతం చేయాలని పరిపాలనాధికారి సుధాకర్ కోరారు. ఆ మేరకు శిల్పారామంలో మంగళవారం సంబరాలకు సంబంధించిన గోడపత్రాలను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13 తేదీలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని, ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ల ఆధ్వర్యంలో ఆకర్షనీయమైన నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11.10.2024 = శిల్పారామంలో మాస్టర్ సూర్య, సూర్య డ్యాన్స్ అకాడమి, మదనపల్లి వారిచే జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే అదే రోజు ఉలిమెల్ల లేక్‌లో మాస్టర్ యువకిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారిచే కోలాటం, జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 12వ తేదీ శిల్పారామంలో మాస్టర్ బి.రాజ, శ్రీ రాజా కళా నిలయం, పులివెందుల వారిచే సినీ, జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. అదే రోజు మాస్టర్ చిట్టి, స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వారి నాగార్జున స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇక చివరి రోజు 13వ తేదీ శిల్పారామంలో మాస్టర్ యువకిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారిచే కోలాటం, జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. అదే రోజు ఉలిమెల్ల లేక్‌లో మాస్టర్ బి.రాజ, శ్రీ రాజా కళా నిలయం, పులివెందుల వారిచే సినీ, జానపద నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. పులివెందుల పట్టణ, పరిసర గ్రామీణ ప్రజలు ఈ దసరా సంబరాలలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



**పులివెందుల, అక్టోబర్ 8 (జనస్వరం) :** పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో మంగళవారం అన్నపూర్ణా దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి సంఘం, దసరా ఉత్సవ కమిటీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్- వనిత క్లబ్, ఆవోపా సలహా సంఘం, వాసవి ఫంక్షన్ హాల్ కమిటీ, ఆర్యవైశ్య వైకుంఠ సేవా కమిటీ, ఆలయ ప్రధాన అర్చకులు శంకర యోగి నవీన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవికుమార్ కార్యదర్శి పట్టాభి రామయ్య, వాసవి క్లబ్ అధ్యక్షుడు సగళ మహేంద్ర, ఆవోప అధ్యక్షుడు దినేష్ సంఘ నాయకులు కామిశెట్టి త్రివేణి కుమార్ మిట్ట కరుణాకర్ మిట్ట శ్రీహరి మేడ హరి, వాసవి పంక్షన్ హాలు కమిటీ కార్యదర్శి కాంబోజి గంగాధర, మిట్ట రామ్మోహన్ రావు, మేడ సాయిబాబా, టీచర్ మేడ హరిచంద్ర ప్రసాద్, సుబ్రహ్మణ్యం, పెనుజూరు నాగభూషణం, వాసవి క్లబ్ జోనల్ చైర్ పర్సన్ నాగభూషణం, మేడా రమణయ్య, వాసవి కాలనీ వినోద్ సోము తదితరులు పాల్గొన్నారు.

జన స్వరం
www.janaswaram.com
తెలంగాణ

# గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ మూడవ ఎడిషన్

- 15000 మొక్కలను పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా 100,000 మందికి పైగా మారథాన్‌లో పాల్గొంటారని అంచనా




**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనస్వరం) :** హార్ట్‌ఫుల్‌నెస్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, అండ్ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌తో కలిసి ఫిట్ ఇండియా మద్దతుతో 17 నవంబర్ 2024న గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ (GGHR) మూడవ ఎడిషన్‌ను ప్రకటించింది. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమా చిగురుపాటి, డా. నైనా జైస్వాల్, జ్యోతిక శ్రీ దండి, సంజయ్ సెహగల్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మారథాన్ కోసం ఇతర భాగస్వాములలో స్పోర్ట్స్ భాగస్వామి డెకాథ్లాన్, టైమింగ్ పార్టనర్ - టైమింగ్ మైల్స్, మారథాన్ పార్టనర్ - ది నైల్ మైల్. వైద్య భాగస్వామి మెడికవర్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (AIU) భారతదేశంలోని 20 రాష్ట్రాల్లోని 20 విశ్వవిద్యాలయాలలో రన్ నిర్వహిస్తుంది. మారథాన్ శారీరక ఆరోగ్యం పర్యావరణ స్థిరత్వం రెండింటినీ ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ యొక్క మూడవ ఎడిషన్, ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్‌నెస్ చొరవ ద్వారా 15,000 చెట్లను నాటడానికి నిధులను సేకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, ఇది కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, హార్ట్ ఫుల్ నెస్ పంపించు అభ్యాసాలను వ్యాప్తి చేయడం పర్యావరణ కారణాలకు దోహదం చేయడం వంటి లక్ష్యాలను కలిగి ఉంది. ఉమా చిగురుపాటి మాట్లాడుతూ "మన తరం, భవిష్యత్తు తరం నాణ్యమైన జీవితాలను కలిగి ఉండాలి. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ అంటే ఆరోగ్యం, ఫిట్‌నెస్ పచ్చదనం ఒకే సమయంలో కలిసి రావడం. ఇది భూగ్రహాన్ని రక్షించడం, సంరక్షించడం పెంపొందించడం ప్రాముఖ్యతను హైలైట్ చేసే చొరవ. రామ్ చంద్ర మిషన్ సంపూర్ణ శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. ఈ పరుగు ప్రకృతితో మళ్లీ కనెక్ట్ అవ్వాలని పర్యావరణం పట్ల స్పృహతో ఉండాలని గుర్తుచేస్తుంది, డా. నైనా జైస్వాల్. జ్యోతిక శ్రీ దండి మాట్లాడుతూ గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ క్రీడల ద్వారా ప్రకృతి గురించి ఆలోచిస్తోంది. ఒక అథ్లెట్‌గా నేను ఇతర క్రీడాకారులను ఈ చొరవలో భాగమయ్యేలా ప్రేరేపించాలని ఆశిస్తున్నాను. సంజయ్ సెహగల్ మాట్లాడుతూ మానవ ప్రయత్నం సామర్థ్యం శ్రేష్ఠత క్రీడలు. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ ఎన్విరాన్‌మెంట్, ఎక్సలెన్స్‌ను ప్రదర్శిస్తుంది. క్రీడలు పర్యావరణం కలిసి రావడం మన హృదయపూర్వక తత్వశాస్త్రంలో భాగం. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ సాధారణంగా బహుళ రేస్ వర్గాలను కలిగి ఉంటుంది, ఇది 1.5కిమీల వంటి చిన్న సరదా పరుగుల నుండి 5K, 10K, హాఫ్ మారథాన్ వంటి పోటీ దూరాల వరకు ఉంటుంది. 21 కిమీ కోసం నమోదు చేసుకోవడానికి ఒకరి వయస్సు 18 ఏళ్లు ఉండాలి లేదా ఈవెంట్ రోజున పాతది, 10Km పరుగు కోసం తక్కువ వయస్సు పరిమితి 15 సంవత్సరాలు, 8 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు 5 కిమీ పరుగు, 2 కిమీ పరుగు కోసం మైనర్‌లు తప్పనిసరిగా పాల్గొనడానికి వారి తల్లిదండ్రుల సమ్మతిని ఇవ్వాలి. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని అంతర్జాతీయ హోస్ట్‌లతో పాటు ప్రపంచవ్యాప్తంగా 90కిపైగా ఇతర స్థానాలు కూడా ప్రపంచవ్యాప్తంగా 100,000 మంది పాల్గొనే అవకాశం ఉంది, కొన్ని వాస్తవంగా కూడా చేరాయి, ఇది అతిపెద్ద గ్లోబల్ గ్రీన్ రన్‌గా నిలవనుంది. గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ 2024 ఎడిషన్ కోసం రిజిస్ట్రేషన్ లింక్ ఇప్పటికే తెరవబడింది. పాల్గొనేవారు అధికారిక ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చు www.greenheartfulnessrun.com

# ఇండియన్ ఆర్మీ అతిపెద్ద 3డీ-ప్రింటెడ్ భవనం ప్రారంభం



**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనస్వరం) :** మధ్యప్రదేశ్‌లోని మోరార్ కంటోన్మెంట్‌లో జవాన్ల కోసం నిర్మించిన మొదటి 3డి ప్రింటెడ్ భవనాన్ని భారత సైన్యం ఆధ్వర్యంలో సగర్వంగా ప్రారంభించింది. సైనిక నిర్మాణాలలో నూతన ఆవిష్కరణలకు రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్, తెలంగాణకు చెందిన సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ భాగస్వామ్యంతో చేపట్టిన ఈ వినూత్న ప్రాజెక్ట్, సైనిక మౌలిక సదుపాయాలలో ఒక పెద్ద ముందడుగును సూచిస్తుంది. "ఇయర్ ఆఫ్ టెక్నాలజీ అబ్సార్ప్షన్ 2024"లో భాగంగా సాంకేతిక పురోగతికి సైన్యం నిబద్ధతను హైలైట్ చేస్తూ, షాబాజ్ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ కెటిజి కృష్ణన్ ఈ బ్యారక్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ అత్యాధునిక బ్యారక్ రిమోట్ క్లిష్టతరమైన, సవాలుగా ఉన్న భూభాగంలో సైనికులకు సమర్థవంతమైన గృహ సముదాయాన్ని, అవసరాన్ని సూచిస్తుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అధునాతన నిర్మాణ పద్ధతులను ఉపయోగించడం ద్వారా, జవాన్లకు నాణ్యమైన వసతి కల్పించడంతోపాటు గృహనిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా పూర్తి చేశారు. ప్రారంభోత్సవ ప్రసంగంలో భాగంగా, జనరల్ ఆఫీసర్ భారత సైన్యం కార్యాచరణ, సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ ప్రాజెక్ట్ యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా జనరల్ ఆఫీసర్ మాట్లాడుతూ, ఈ 3డి ప్రింటెడ్ బ్యారక్‌ను ప్రవేశపెట్టడం మా బలగాలకు, ప్రత్యేకించి సాంప్రదాయకంగా నిర్మాణాలు చేపట్టడం సాధ్యం కాని ప్రాంతాలలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం గణనీయమైన విజయాన్ని సాధించింది. ఈ అధునాతన సాంకేతికత గృహ అవసరాలకు త్వరగా స్పందించడానికి వీలు కల్పిస్తుంది. ఐఐటీ హైదరాబాద్, మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్, సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సహకారం ఈ విజన్‌ని నిజం చేయడంలో కీలకంగా కృషి చేశాయి. మేము 2024ని ఇయర్ ఆఫ్ టెక్నాలజీ అబ్సార్ప్షన్ గా జరుపుకుంటున్నందున, మా కార్యకలాపాలలో అటువంటి సంచలనాత్మక పరిష్కారాల ఏకీకరణకు మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ మైలురాయితో, ఇండియన్ ఆర్మీ తన సిబ్బందికి గృహనిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు అధునాతన నిర్మాణ సాంకేతికతలను విస్తరించేందుకు సిద్ధంగా ఉంది. ఈ అభివృద్ధి సైనిక నిర్మాణాలలో ఆవిష్కరణకు కొత్త బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆర్మీ ఆధునీకరణ ప్రయాణంలో గణనీయమైన పురోగతిని సూచిస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీనియర్ సైనిక అధికారులు హాజరయ్యారు.

# సీపీఎం ప్రసాద్ మృతి పార్టీకి, ప్రజాఉద్యమాలకు తీరనిలోటు

**సీపీఎం ప్రసాద్‌కు పలువురి ఘన నివాళులు**



**నాగులుప్పలపాడు (చీరాల), అక్టోబర్ 8 (జనస్వరం) :** సీపీఎం ప్రసాద్ మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలువురు నాయకులు, వక్తలు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, నిడమానూరు గ్రామానికి చెందిన, సీపీఎం నేత ఊదరగుడి ప్రసాదు సంతాప సభ ఘనంగా జరిగింది. ఈ సందర్బంగా సోమవారం పలువురు నాయకులు ప్రసాదు చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మృతి పార్టీకే కాకుండా, ప్రజా ఉద్య మాలకు తీరని లోటన్నారు. 1996నుండి సీపీఎంలో సభ్యునిగా కొనసాగుతూ, శాఖాకార్యదర్శిగా పనిచేసారని, గ్రామంలో కూలీ పోరాటాలు, భూపోరాటాలు, పేదలకు ఇంటి స్దలాల మంజూరు, తదితర పలు ప్రజాసమస్యలపై, నిరంతరం పోరాడి, ప్రజల్లో మంచి గుర్తింపు పొందారన్నారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ప్రసాదు ఆశయాలను స్పూర్తిగా తీసుకొని, యువత ముందుకు వెళ్ళాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కంట్రోల్ కమిటి చైర్మన్, రాష్ట్ర కమిటి సభ్యులు జాలా అంజయ్య, సీపీఎం జిల్లాకమిటి సభ్యులు జె జయంతిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కె మాబు, ఉబ్బా ఆది లక్ష్మి, కంకణాల ఆంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి టి శ్రీకాంత్, ఉప్పుగుండూరి వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి సర్కులేషన్ బ్రహ్మయ్య, జర్నలిస్ట్ స్టాలిన్, జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి

**ఎన్ఆర్ అండ్ పీఎం హై స్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామ కృష్ణ**



**చీరాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ గ్రౌండ్స్‌లో 12 అడుగుల వాకింగ్ ట్రాక్‌ని ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఎన్ఆర్ అండ్ పీఎం హై స్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామ కృష్ణ విజ్ఞప్తి చేశారు. హైస్కూల్ గ్రౌండ్స్‌లో, ఆరోగ్యం కొరకు ఉదయం, సాయంకాలం వేళల్లో మహిళలు, పురుషులు వందల సంఖ్యలో నడక సాగిస్తుంటారన్నారు. పట్టణంలో ఉన్న ఏకైక గ్రౌండ్ ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ గ్రౌండ్ మాత్రమేనన్నారు. కానీ వర్షం పడితే నీరు నిలవడం, బురదగా వుండి, నడవటానికి వీల్లేకుండా ఉంటుందన్నారు. ఇంత వరకు వాకింగ్ ట్రాక్ లేదని, వాకింగ్‌కి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలానే వాలీ బాల్, ఫుట్ బాల్ ఆడే క్రీడాకారులు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, 12 అడుగుల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

# అన్నప్రసాదం కార్యక్రమంలో నగేష్ ముదిరాజ్



**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనస్వరం) :** రాంనగర్ లోని శివ శక్తి అసోసియేషన్ రాజు ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి అన్నప్రసాదం కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నగేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్య ప్రభను కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు



**ప్రత్తిపాడు, అక్టోబర్ 8 (జనస్వరం) :** నియోజకవర్గంలో ఏలేశ్వరం ఆర్టీసీ కార్మిక సంఘాల ఉద్యోగులు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ని కలిశారు. అవినీతి ఆరోపణలపై ఇటీవల విధుల నుండి తొలగించిన ఏలేశ్వరం డిపోకి చెందిన కండక్టర్ శ్రీనివాసరావును తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. కండక్టర్ శ్రీనివాసరావు నిజాయితీ పరుడు అని, అవినీతికి పాల్పడే వ్యక్తి కాదని, అతనిపై వచ్చిన ఆరోపణలలో నిజం లేదన్నారు. అతనిని విధుల్లోకి తీసుకునేలా చూడాలని ఎమ్మెల్యేని కార్మిక నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# మేనేజ్మెంట్ స్పాట్ అడ్మిషన్లకు స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ రాదు

**శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి స్పాట్ మరియు మేనేజ్మెంట్ అడ్మిషన్లు**



**నంద్యాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఉన్న శ్రీ రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ప్రారంభిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. విద్యా సంవత్సరంలో ప్రవేశానికి గాను కళాశాలలో స్పాట్, మేనేజ్మెంట్ కోటా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం విద్యా ర్థులు అక్టోబరు 14వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్ర దించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు, మేనేజ్మె ంట్ కోటా పొందిన వారికి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ని కళాశాల వద్దకు వచ్చి గాని లేదా కింద తెలిపిన ఫోన్ నెంబర్‌లో గాని సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య తెలియజే శారు. జిల్లా కేంద్రంలో ఉన్న కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుదూర ప్రాంతాల్లో విద్య కంటే పట్టణ కేంద్రంలో ఉన్న అన్ని సదుపాయాలు వసతులు ఉన్న ఈ కళాశాలలో విద్య విలువైనదన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ పండుగ



**అశ్వాపురం, అక్టోబర్ 8 (జనస్వరం) :** కళ్యాణపురం అశ్వాపురం సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో మిట్టగూడెం 1 సెంటర్లో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో, సూపర్వైజర్ ఏనిక సావిత్రి పాల్గొని, బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రంలో అపార ప్రాముఖ్యత కలిగి ఉన్నది అని వెల్లడించారు. "ఈ పండుగ జీవనాన్ని పునఃప్రతిష్ట చేసే, బతుకు విలువలను ప్రతిబింబించే, అమ్మ ప్రేమను, ప్రకృతిని గౌరవించే గొప్ప సందేశాన్ని అందిస్తుంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకలో అంగన్‌వాడీ టీచర్లు పూలతో సృజనాత్మకంగా రూపొందించిన బతుకమ్మను అలంకరించి, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో నృత్యాలు నిర్వహించారు. ఈ ఉత్సవం, మహిళల బలాన్ని, సమాజంలోని అనుబంధాలను ప్రదర్శిస్తూ, ప్రకృతిని పూజించే సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించింది. చివరగా, బతుకమ్మను పల్లె సమీపంలోని నదిలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని పునరావృతం చేసారు, ఈ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది. ఇలాంటి కార్యక్రమాలు, మహిళల శక్తిని, సామాజిక ఐక్యతను మరియు సాంప్రదాయాలను ప్రోత్సహిస్తూ, సమాజాన్ని కలిసిన శక్తిగా నడిపించడానికి దోహదం చేస్తాయని ఈ ఉత్సవం స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ పరిష్కరాజమ్మ మరియు అంగన్‌వాడీ టీచర్లు కే.నాగమణి, టీ.మాలతి, ఈ.కళ్యాణి, భారతి, అన్నపూర్ణ, వై.అరుణ, జి.వెంకట లక్ష్మి, ఎన్. కోటేశ్వరి, సీహెచ్.హేమలత, సరిత, ఎస్.రమాదేవి, పి.సరోజినీ, మల్లికాంబ, అరుణ కుమారి, లలిత, జీజీ, బి.సునీత, పి.శారద, జయమ్మ, ఎం.నాగమణి, జి.బేబీ, కే.చుక్కమ్మ, కే.సారమ్మ, సైదమ్మ, కే.జయమ్మ, దేవ కుమారి, ఎం నాగమణి, టీ.విజయ రంగమ్మ పాల్గొన్నారు.

# అట్టహాసంగా రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు

- కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రారంభించిన పాలకొల్లు రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్



**పాలకొల్లు, అక్టోబర్ 8 (జనస్వరం) :** పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న బాల బాలికల టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించారు. కాస్మో ప్రాంగణంలో కాస్మో అధ్యక్ష కార్యదర్శులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, వివి సోమరాజు ఆధ్వర్యంలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులు కీర్తిశేషులు రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలను అత్యంత ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభకు కాస్మో ఉపాధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. కోశాధికారి రుద్రరాజు రమేష్ రాజు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కెవి కృష్ణ వర్మ, టెన్నిస్ టోర్నమెంట్ చైర్మన్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఆర్గనైజర్ వీరవల్లి మోహన కళ్యాణ్ కుమార్, క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు చేకూరి సూరిబాబు, తదితరులు వేదికను అలంకరించి మాట్లాడారు. అండర్ 18, అండర్ 10, అండర్ 12, అండర్ 14 ఈ నాలుగు విభాగాల్లో సింగిల్స్ డబుల్స్ కేటగిరీలలో టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాస్మో టెన్నిస్ కమిటీ చైర్మన్ పొత్తూరి వరప్రసాదరాజు, సభ్యులు జి సుబ్రహ్మణ్య రవిరాజు, పనమట మావుళ్ళు, కాస్మో ఈసీ నెంబర్లు కలిదిండి గణపతి రాజు, కే. శ్రీనివాసరాజు, పి. మెహర్ ప్రసాద్ వర్మ, అధిక సంఖ్యలో టెన్నిస్ క్రీడాకారులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

# గ్రామ సింహాలు కావు క్రూర మృగాలు

**బాలిక గొంతు కొరికి గాయపరిచిన కుక్కలు**




**అమడగూరు, అక్టోబర్ 8 (జనస్వరం) :** అడవి మృగాలను తలపించేలా గ్రామ సింహాలు జనాలపై విరుచుకుపడుతూ రోజు ఎవరినో ఒకరిని కరిచి గాయపరుస్తున్న సంఘటన మండలంలోని జవుకులకొత్తపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో వీధి కుక్కలు గ్రామాలపై పడి ప్రజలను చంపి పీక్కు తినే రోజులొచ్చే కాలం ఎంతో దూరం లేదనడానికి ఈ సంఘటన నిదర్శనం. మండలంలోని జవకుల కొత్తపల్లికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక శ్రీనిధిరాయ్ తన ఇంటి ఆవరణలో నిలబడి వుండగా కుక్కలు బాలికపై దాడి చేసి గాయపరిచాయి. బాధిత బాలిక శ్రీనిధిరాయ్ తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు తమ కుమార్తె ఇంటి ఆరుబయట ఉండగా కుక్కలు ఒక్కసారిగా వచ్చి గొంతు పట్టుకుని చంపబోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక తల్లిదండ్రులు,చుట్టు ప్రక్కల వారు అప్రమత్తమై కుక్కలను తరిమివేశామన్నారు. ముఖంపై, గొంతు వద్ద గాయాలతో ప్రాణాలతో బయట పడిందన్నారు. సంబంధిత అధికారులు కుక్కలను గ్రామాల్లో లేకుండా అదుపు చేసే చర్యలు తీసుకోవాలని కోరారు.

# అశ్వాపురంలో బైక్ ప్రమాదం

**ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు**




**అశ్వాపురం, అక్టోబర్ 8 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ఓం శక్తి దేవాలయం నుండి అశ్వాపురం బస్టాండ్ వరకు నడుచుకుంటూ వెళ్తున్న మణుగూరు నివాసి మంగమ్మ అనే మహిళను మంగళ వారం రాత్రి ఓ బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడిన మహిళను వెంటనే స్థానికులు అశ్వాపురంలోని ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన బైక్ నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడగా, అతనిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు ఆటో ద్వారా తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# కాఫీ రైతుల సంక్షేమమే మ్యాక్స్ సంస్థ ధ్యేయం

- ఈ ఏడాది రెండు వేల టన్నుల నాణ్యమైన కాఫీ పళ్ళు సేకరణ లక్ష్యం
- 4300 మంది కాఫీ రైతులకు రూ.24 లక్షల బోనస్
- ఈ ఏడాది కాఫీ కొనుగోలు ధర త్వరలో ప్రకటన



**చింతపల్లి, అక్టోబర్ 8 (జనస్వరం) :** కాఫీ రైతులు సంక్షేమమే లక్ష్యమని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ అన్నారు. కాఫీ రైతుల నుండి నాణ్యమైన కాఫీ పళ్ళను సేకరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. మంగళవారం చింతపల్లి కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, చింతపల్లి, జి కె వీధి, కొయ్యూరు మండలాల లైజాన్ వర్కర్లుతో సమావేశం నిర్వహించారు. కాఫీ రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 2024 నవంబర్ నెల నుండి కాఫీ సేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. నాణ్యమైన కాఫీ పళ్ళు మాత్రమే సేకరించాలని ఆదేశించారు. 2వేల టన్నుల కాఫీ పళ్ళను సేకరించడం లక్ష్యంగా నిర్దేశించమని స్పష్టం చేశారు. గత ఏడాది 836 టన్నుల కాఫీ పళ్ళు సేకరించి రైతులకు కిలో కాఫీ పళ్ళకు రూ.43లు చెల్లించడం జరిగిందన్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన కేజీ కాఫీ పళ్ళకు అదనంగా మూడు రూపాయలు బోనస్ రైతులకు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ఏడాది 189 మెట్రిక్ టన్నుల పార్చ్మెంట్, 33 టన్నుల చెర్రీ ఉత్పత్తి జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,500 మంది కాఫీ రైతులను గుర్తించడం జరిగిందన్నారు. అనంతగిరి మండలం నుండి 50, అరకు వేలి, డుంబ్రిగూడ నుండి 120, హుకుంపేట 200, పెదబయలు 120, ముంచంగిపుట్టు 100, పాడేరు 120, జి మాడుగుల 350, చింతపల్లి 400 మెట్రిక్ టన్నుల కాఫీని సేకరించాలని దిశ నిర్దేశం చేశారు. ఎపెక్స్ కమిటీ నిర్ణయం మేరకు ఈ ఏడాది కాఫీ కొనుగోలు ధర నిర్ణయిస్తామన్నారు. 6.50 లక్షల వ్యయంతో కాఫీ ఏకో పల్పింగ్ యూనిట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కాఫీ అధికారులు పనితీరును ఆయన ప్రశంసించారు. ఈ ఏడాది మరింత ఉత్సాహంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం వెంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్ అశోక్, 11 మండలాల ఏఈఓలు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, మ్యాక్స్ సొసైటీ అధ్యక్షులు సేగ్గే కొండలరావు, ఉపాధ్యక్షులు గాం సింహాచలం, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు తగదు

**టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు**



**చింతపల్లి అక్టోబర్ 8 (జనస్వరం) :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై వైసీపీ పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి చేసిన ఆరోపణలు తగదని మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనందరావు, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఆంద్రాబు లక్ష్మణ్‌తో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆదరణ కోల్పోయి చిత్తుగా ఓడిపోయిన వైకాపా నాయకులకు ఇంకా అధికార దాహం పోలేదని, అధికార దాహంతో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే సీఎం చంద్రబాబు మొట్టమొదటగా తొలి సంతకాన్ని డీఎస్సీపై పెట్టినట్లు తెలిపారు. మూడు వేలు ఉన్న అవ్వ తాతల పింఛన్ ఒకసారిగా 4 వేలు పెంచి, అధికారం చేపట్టిన నెలలో మొదటి తేదీన వారి ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతుల భూములు అన్యక్రాంతం కాకుండా కాపాడేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల భూములకు భూ హక్కు కల్పించినట్లు తెలియజేశారు. దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓవైపు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు నిందారోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పడాల సత్తిబాబు, బేత నాగు తదితరులు పాల్గొన్నారు.

# 14న పల్లె పండుగ

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**పుట్టపర్తి, అక్టోబర్ 8 (జనస్వరం) :** ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'పల్లె పండుగ' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో పల్లె పండుగ కార్యక్రమాలపై మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు.స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాలు నందు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు, అన్ని పంచాయతీలు పరిధిలో 990 పనులను గుర్తించి, వాటికి సంబంధించి రూ.62 కోట్లు అంచనాలు వేసినట్లు తెలిపారు.ఇప్పటివరకు కొన్ని పనులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చి,అప్లోడ్ చేశామని,మిగిలినవి రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు.ఆయా పనులకు ఎలాంటి ఇసుక కొరత లేదని, చెప్పారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు.గత ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13,325 పంచాయతీల్లో ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన పనులకు కలెక్టర్లే పరిపాలన అనుమతులు ఇచ్చారని,అన్ని పనులకూ 14వ తేదీ నుంచి వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపనలు చేయించి,అంతే వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.2500 కోట్లతో దాదాపు 20వేల పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డిపిఓ సమత తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టండి

- ఈ నెల 14 నుండి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు
- ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించండి
- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



**నంద్యాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** ఈ నెల 14 నుండి 20 తేది వరకు వారం రోజులపాటు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో నిర్దేశించిన అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పంచాయతీరాజ్, డ్వామా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహణపై ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అడవులు, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, డ్వామా పీడీ జనార్ధన్ రావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 20 తేది వరకు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో దాదాపు 90 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన 1024 పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని డిప్యూటీ సీఎంకు వివరించారు. ఉపాధి హామీ పథక నిధుల అనుసంధానంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు తదితర పనులకు




ప్రారంభోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేసిన 1026 పనులకు వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపనలు చేసి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెపండగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో నిర్దేశించిన పనులకు పెద్దఎత్తున శంకుస్థాపనలు చేయాలన్నారు. శంకుస్థాపన కోసం గ్రామ పంచాయితీలు, ఎమ్మెల్యేలవారీగా రోజువారీ రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి వరల్డ్ రికార్డ్ యూనియన్ అవార్డు అందుకున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 2081 కోట్ల వేతన బకాయిలు జమ చేశామని మంత్రి తెలిపారు. 2024-25 ఏడాదికిగాను రూ. 4,500 కోట్ల నిధులతో పనులకు గ్రామ సభల ఆమోదం పొందాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల పనులకు పల్లె పండుగలో శ్రీకారం చుట్టామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మంజూరైన పనులకు పండుగ వాతావరణంలో భూమిపూజలు నిర్వహించాలన్నారు. ఉపాధి, ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన నిర్మాణాలు సంక్రాంతి పండుగలు పూర్తిచేసి ప్రారంభోత్సవాలు జరుపుకోవాలని మంత్రి కలెక్టర్లను సూచించారు.

# వివాహిత అనుమానాస్పద మృతి

- ఆచంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- కాల్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్న పోలీసులు



**పాలకొల్లు, అక్టోబర్ 8 (జనస్వరం) :** ఆచంట వేమవరానికి చెందిన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు వివాహిత షేక్ రజియా (33) అనుమానాస్పద పరిస్థితులో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామానికి చెందిన బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న షేక్ రజియా (33) మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఉరి వేసుకొని మృతి చెందింది. ఆ సమయంలో 13 సం.ల కుమార్తె, 9 సం.ల కుమారుడు అక్కడకు సమీపంలోని నానమ్మ ఇంటికి కూర తీసుకుని వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తల్లి విగతజీవిగా ఉండటంతో కేకలకు ఇరువుపొరుగువారు వచ్చి శవాన్ని దించారు. భర్త షేక్ సిలార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆచంట ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన యువకుడిపై బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె కాల్ డేటా ఆధారంగా కేసు రేపు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# జల జీవన్ కాదు...ధన జీవన్

**అధికారులు గుత్తేదారులకు కాసులు కురిపిస్తున్న జలజీవన్ పనులు**





**చింతపల్లి, అక్టోబర్ 8 (జనస్వరం) :** గిరిజన ప్రాంతంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు అధికారులు గుత్తేదారులకు కాసులు కురిపిస్తున్న ధనజీవన్ పనులుగా మారాయి. పైపు వేసామా! బిల్లు మార్చామా!, ట్యాప్ బిగించామా! బిల్లు మార్చామా! అన్న చందంగా మారింది జల జీవన్ మిషన్ పనుల పరిస్థితి. మండలంలోని అన్న వరం పంచాయతీ, అన్నవరం చేతుడి వీధి కాలనీ, అన్నవరం పాత వీధిలో రెండేళ్ల క్రితం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కొళాయిలు వేసి పైపులు ఏర్పాటు చేసి చేతులు దులుపు కున్నారు. గుత్తేదారు, ఇక్కడ పైపులు బిగించి కొళాయిలు ఏర్పాటు చేయడమే గొప్ప అని ఆ శాఖ అధికారులు అనుకున్నారో! ఏమో! కానీ ఆ కొళాయిలకు నీటి సరఫరా ఇవ్వడం మరిచారు. నాటి నుండి ఆ కొళాయిలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొళాయిలు ఏర్పాటు చేసే సమయంలో ప్రయోగం కోసం గ్రామంలో ఉన్న పాత బోరులో మోటర్ అమర్చి విద్యుత్ ఆన్ చేయగానే విద్యుత్ మీటర్‌లో పొగలు తేలి మోటర్ మరమ్మతులకు గురైందని, మోటార్ బాగు చేసుకొని వస్తామని నాడు వెళ్లిన గుత్తేదారుడు నేటి వరకు తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు వెలుసూరి సింహాచలం, జర్ర రాజు, గెమ్మలి సోనాయి, పాంగి లక్ష్మణరావు, వంతల రాజారావు ఆరోపించారు. జల జీవన్ మిషన్ పనులు ఆ శాఖ అధికారులు, గుత్తేదారులకు వరంగా మారి ప్రజలకు శాపంగా మారాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారు



**రేణిగుంట, అక్టోబర్ 8 (జనస్వరం) :** మండలంలోని రామ కృష్ణాపురం గ్రామంలో వెలసిన శ్రీ అం కాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా 5వ రోజు సోమవారం శ్రీ లలిత త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులను కటాక్షిం చారు. తెల్లవారుజామున ఆలయ పూజారి మున స్వామి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి ప్రతిరూపంగా శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారిని అలంకరించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తొమ్మిది రోజులు పాటు జరిగే దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు గ్రామంలోని వారు ఉదయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజ అభిషేక అభిషేక కైకర్యాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# రాచగున్నేరి వద్ద బస్సులు ఆపాలని మహిళలు నిరసన

**రేణిగుంట, అక్టోబర్ 8 (జనస్వరం) :** తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే ఆర్టీసీ బస్సులు శ్రీకాళహస్తి గ్రామీణం రాచగున్నేరి వద్ద బస్సులు ఆపాలని మంగళవారం స్థానిక మహిళలు రాచగున్నేరి రోడ్డు వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వచ్చే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు రాచగున్నేరి వద్ద ఆపడం లేదని బ్రిడ్జిపైనే వెళుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఆర్టీసీ సిబ్బంది స్పందించి రాచగున్నేరి రోడ్డు వద్ద ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన వారితో నాట్య ప్రదర్శన





**యాడికి, అక్టోబర్ 8 (జనస్వరం) :** యాడికి అమ్మవారి శాలలో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వందన డాన్స్ అకాడమీ భరత నాట్యం (క్లాసికల్) డాన్స్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులచే నాట్య ప్రదర్శన కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాడికి ప్రజలు యాడికి ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం వాసవి సేవా సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.

# ప్రతి మెడికల్ షాప్ నందు ఫార్మసిస్ట్ ఎక్కడ?

- సెక్షన్ 42 ను అమలు పరచండి
- ఏపీ ఫార్మసీ అసోసియేషన్ సెక్రెటరీ




**నంద్యాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ లక్షల సంఖ్యలో మెడికల్ షాప్‌లో ఉన్నాయని, వాటన్నింటిలో ఫార్మసిస్టులు ఉండేటట్లు చట్టంలోని సెక్షన్ 42ను అమలుపరిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఫార్మసీ అసోసియేషన్ సెక్రెటరీ చక్రధర్ పేర్కొన్నారు. నంద్యాలలో ప్రైవేటు హొటల్ నందు మంగళవారం రాష్ట్రస్థాయి ఫార్మసిస్టుల సదస్సు,జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఫార్మాసిస్టు, ముఖ్య అతిదులు సెక్రెటరీ చక్రధర్‌తో పాటు సంఘం నాయకుడు మర్రి భాస్కరు, ప్రిన్సిపల్ మధుసూదన్, ప్రభాస్ కాలేజ్ ప్రిన్సిపాల్ సారథిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మాసిస్ట్ ల ఐక్యత ను పాటించాలని, మన హక్కుల సాధనకు కృషి పోరాటం చేయాల్సిన ఆసన్నం వచ్చిందన్నారు. ఫార్మసిస్టులు లేనిదే దగ్గు వ్యవస్థ లేదన్నారు. మా డిమాండ్లను పరిష్కరించాలని వారు పేర్కొన్నారు ఫార్మాసిస్ట్‌లకు అందరికీ సరైన వేతనం పెంచాలని, ప్రభుత్వం గవర్నమెంట్ ఫార్మాసిస్ట్‌ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔటసోర్సింగ్ ఫార్మాసిస్ట్‌లను రెగ్యులర్ చేయాలని, ప్రతి మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, ప్రభుత్వం ఉత్తర్వులు చట్టంలోని సెక్షన్ 42ను కఠినంగా అమలు చేయాలని కోరారు. డ్రగ్ ఇన్సుఫెక్టర్ పోస్ట్‌లు పెంచాలని ఫార్మసీ కౌన్సిల్ అఫ్ ఆంధ్రప్రదేశ్ నందు ఎన్నికలు జరపాలని, ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్తు లో ఫార్మా పరిశ్రమలు వచ్చే విదంగా ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. ఫార్మ డి డాక్టర్ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ హాస్పిటల్స్‌లో క్లినికల్ ఫార్మసిస్ట్‌గా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లలో ఫార్మ్ డి డాక్టర్స్ కోర్సు పూర్తి చేసిన వారే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని లేనిచో భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు కొత్త అధ్యక్షునిగా శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా విష్ణువర్ధన్ రాజశేఖర్ సుధీర్, సల్మాన్ రాజ్, రమణ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# యాడికి వారాహి ఉత్సవ కమిటీ ఉత్సవాలు

**యాడికి, అక్టోబర్ 8 (జనస్వరం) :** శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి దేవాలయం ఆవరణంలో "వారాహి ఉత్సవ కమిటీ" ఆధ్వర్యంలో ఆరవ రోజు "శ్రీ మహా లక్ష్మి" అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ దుర్గా దేవి అమ్మవారు పూజా కార్యక్రమాలు నిర్వహించిన వెంగోటి పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులు విజన్ స్కూల్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ,మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు



**పుట్టపర్తి, అక్టోబర్ 8 (జనస్వరం) :** మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నుంచి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కామెంట్స్ చేశారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని, కార్యకర్తల కష్ట సుఖాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలుపంచుకుంటారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుంది.రాష్ట్రం నలుమూలల నుంచి మంగళగిరి టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన టీడీపీ కార్యకర్తలు మరియు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు కార్యకర్తల న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారి హామీ ఇచ్చారు.

# సాగునీటి సంఘాల ఏర్పాటుకు ఎన్నికలను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం

**జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**





**పుట్టపర్తి, అక్టోబర్ 8 (జనస్వరం) :** జిల్లాలో సాగునీటి వినియోగ దారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుండి రాష్ట్రంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా నీటిపారుదల కింద ఉన్న సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై జిల్లా జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండిజిల్లా కలెక్టర్, టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్, అభిషేక్ కుమార్ డిఆర్వో కొండయ్య, జలవనరుల శాఖ అధికారులు దేశనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాలు ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు సంబంధిత అధికారులు పకడ్బందీగా కార్యాచరణను తయారు చేసి నివేదించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 230 పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి సీఎం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని, నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. అక్టోబర్ 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూలు, నామినేషన్ పత్రాలను కలెక్టరేట్లకు పంపడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ విడుదల చేసిన పిదప రోజు వారి కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘానికి 6 మంది ప్రాదేశిక సభ్యులను 6 ఎన్నుకోవాలని, వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకోవాలన్నారు. నీటి సంఘానికి అధ్యక్షున్ని ఎగువ ప్రాంతాల నుండి ఎన్నుకో బడినట్లయితే, ఉపాధ్యక్షుడు దిగువ ప్రాంతాల నుండి వైస్-వెర్సా నుండి తప్పక ఎంపిక చేయబడాలని మంత్రి పేర్కొన్నారు.అనంతరం వివిధ అంశాలపై తగుసూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, పెనుగొండ ఆర్డిఓ ఆనంద్, కదిరి ఆర్డీవో శర్మ, జల వనరుల శాఖ అధికారులు గంగాధర్ డిఈ, గంగాద్రి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో "పొలం పిలుస్తోంది"



**యాడికి అక్టోబర్ 8 (జనస్వరం) :** మండలంలోని యాడికి మరియు చందన గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుత్తి డివిజన్ ఏడీఏ వెంకటరాముడు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏడీఏ వెంకటరాముడు మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా వర్షం తక్కువగా ఉన్నందున కరువు స్థితులను అంచనా వేసి పై అధికారులకు పంపడం జరుగుతుందని, పంట పరిస్థితులను, పంట దిగుబడులను గూర్చి రైతులతో చర్చించారు. అలాగే పత్తి పొలాలను సందర్శించారు. ప్రస్తుతం పత్తిలో గులాబీ రంగు పురుగు బెడద ఎక్కువగా ఉందని, దీని నివారించుటకు స్పైనోసాడ్‌ను సకాలంలో వాడడం మంచి ఫలితాలను ఇస్తుందని, అలాగే పత్తి విత్తిన 45 రోజుల తర్వాత పుష్పించే దశలో లింగాకర్షణ బుట్టలను ఎకరాకి ఎనిమిది చొప్పున పొలంలో ఏర్పాటు చేసి పంట ఆఖరి కోత పూర్తయ్యే వరకు వాటిని పొలంలోనే ఉంచినట్లయితే గులాబీ రంగు పురుగు బెడద నుండి తప్పించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి జహిరున్, గ్రామ వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, రేష్మ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో వెలువడిన ఎన్నికల ఫలితాలపై హర్షం


**కిషన్ మోర్చా ఆర్గానిక్ కన్వీనర్ చింత శరత్ కుమార్ రెడ్డి**



**పుట్టపర్తి, అక్టోబర్ 8 (జనస్వరం) :** దేశ ప్రజల హృదయాల్లో నరేంద్ర మోడీ హర్యానా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల్లో వెలువడిన ఎన్నికల ఫలితాలు బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల దేశ ప్రజల మరోసారి విశ్వాసం ప్రదర్శించారని బీజేపీ కిషన్ మోర్చా ఆర్గానిక్ కన్వీనర్ చింతా శరత్ కుమార్ రెడ్డి అన్నారు. హర్యానా రాష్ట్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాలుగా ప్రజలకు నీతి వంతమైన పాలన అందించినందుకు ప్రజలు మూడోసారి గెలిపించాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాలుగా ప్రజలను మభ్యపెట్టిన ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని తెలిపారు. జమ్ము కాశ్మీర్ ఎన్ని కల్లో ఆర్టికల్ 370 తర్వాత జరిగిన ప్రజాస్వామ్యం ఎన్నికలలో బీజేపీ గణనీయమైన కోటి శాతం సాధించిందని, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా రాబోయే రోజుల అధికారం పైసలు చేసుకునే దిశగా జమ్ము కాశ్మీర్ భారతీయ జనతా పార్టీ ఎదుగుతున్నదని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలు బీజేపీ ఆదరి స్తున్నారని ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయాన్ని ఎవరు అడ్డుకోలేరని, రాబోవు రోజుల్లో తెలుగు రాష్ట్రంలో కూడా బీజేపీ జెండాను ఎగరేస్తామని సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనమైన విజయాన్ని అందించిన హర్యానా,జమ్మూ కాశ్మీర్ ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

**లోకేశ్వరం మండలం కేంద్రంలో కమిటీ ఎన్నిక**



**లోకేశ్వరం, అక్టోబర్ 8 (జనస్వరం) :** ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల సంఘాల ఆందోళన చేస్తునే ఉన్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీ ఏర్పాటు మాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. మంగళవారం లోకేశ్వరాం మండలం కేంద్రంలోని మాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే. ఉపాధ్యక్షులు గంగాధర్ దగ్డే, సెక్రటరీ విఠల్ కాంబ్లే, క్యాషియర్ దర్మాజి చందనే, న్యాయ సలవాదారులు దేవిదాస్ హస్డే, ఆధ్వర్యంలో మండల గౌరవ అధ్యక్షులు దండే రమేష్, అధ్యక్షులు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఎం. రాజు, ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి. చంద్రశేఖర్, కార్యదర్శి బి.ఎర్రన్న, కోశాధికారి,జి. గంగాధర్, సలహాదారులు, హర్ష ముత్యం. మీడియా కన్వీనర్లు పి.మధుకర్ ,దేవల్ల రాజేందర్.కు ఎన్నుకున్నారు.కోర్టు తీర్పు పై త్వరలో కార్యాచరణ ఏర్పాటు చేసి వర్గీకరణ రద్దు చేసే వరకు పోరటంకు సిద్ధం కావాలని శంకర్ చంద్రే కమిటీ సభ్యులు సభ్యులు పిలుపునిచ్చారు. ఆర్టికల్ 341 ప్రకారం ఏదైనా ఒక కులాన్ని షెడ్యూల్ కలాల జాబితాలో చేర్చాలన్నా లేదా తీసివేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందని శంకర్ చంద్రే పేర్కొన్నారు. రిజర్వేషన్ తగ్గించే అధికారం పార్లమెంటుకు లేదన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


## అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు నంద్యాల వాసి కావటం గర్వకారణం

**అర్షద్‌ను సత్కరించిన మంత్రి ఫరూక్**



**నంద్యాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** నంద్యాలకు చెందిన అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు అర్షద్‌ను మంగళవారం న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఘనంగా సత్కరించారు. అర్షద్ ఇటీవల ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో సైక్లింగ్‌లో భారతదేశం తరపున పాల్గొన్నాడు. పారా ఒలింపిక్స్‌లో సైక్లింగ్‌లో భారతదేశం పాల్గొనడం ఇదే మొదటిసారి కావటం విశేషం. నంద్యాలకు చెందిన అర్షద్ 10 సంవత్సరాల వయసులో రోడ్డు ప్రమాదంలో ఒక కాలు కోల్పోయిడం జరిగింది. ప్రమాదం జరగక ముందు తైక్వాండో క్రీడలో పతకాలు సాధించిన అర్షద్, ప్రమాదంలో కాలు కోల్పోయిన తర్వాత వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రోత్సాహంతో విలువిద్యలో (ఆర్చరీ) ప్రత్యేక కోచ్‌తో శిక్షణ పొంది జాతీయస్థాయిలో పాల్గొని పతకాలు సాధించాడు. అటు తరువాత హైదరాబాద్ మెహతా ఫౌండేషన్‌లో ఇచ్చిన ప్రోత్సాహంతో హిమాలయాల్లో భాగీరథి పర్వతాన్ని ఒక కాలుతోనే అధిరోహించారు. బిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒక కాలుతోనే సైకిల్ యాత్ర చేశారు. స్విమ్మింగ్ బాడీ బిల్డింగ్‌లో కూడా రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాడు. నంద్యాల ఐఎంఏ, దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్, కళారాధన ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ చేతుల మీదుగా శాలువ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ అర్షద్ కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఇప్పించాలని మంత్రి ఫరూక్ కు విజ్ఞప్తి చేశారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడలలో పాల్గొని దివ్యాంగుడైన అర్షద్ తన వైకల్యాన్ని అధిగమించి అనేక పతకాలు సాధించడం నంద్యాల జిల్లా వ్యక్తి కావటం గర్వకారణం అంటూ ప్రశంసించారు. అర్షద్ ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. సీఎం దృష్టికి తీసుకు వెళ్లి అర్షద్ కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనీల్, రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎంపీవి రమణయ్య,లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, జిల్లా చైర్మన్ శ్రీకాంత్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమాడ నూతన ఎస్ఐ దాదా పీర్‌ను కలిసిన హమాలీలు



**నల్లమాడ, అక్టోబర్ 8 (జనస్వరం) :** మండల నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన దాదా పీర్‌ను మంగళవారం హమాలి సంఘం అధ్యక్షుడు కిష్టప్ప నూతన ఎస్సైకి శాలువా కప్పి పుష్పగుచ్చాలను అందజేసి పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, హమాలి సంఘం మాజీ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు సురేష్, కార్యదర్శి రమేష్, చిన్న నరసింహులు, లక్ష్మన్న, దార్ల రామప్ప, తలారి రామాంజి, బోనం గంగప్ప, వెంకటేష్, పసుపులేటి నాగరాజు, పాల లక్ష్మన్న, హమాలి సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## వాటర్ బాటల్‌పై అధిక ధరలు వసూలు చేస్తున్న శ్రీకాళహస్తి సినిమా థియేటర్ సిబ్బంది

- కనీస ధర రూ.20లు
- రూ.30 రూపాయలు వసూలు చేస్తున్న శ్రీకాళహస్తి థియేటర్ నిర్వాహకులు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 (జనస్వరం) :** శ్రీకాళహస్తిలో థియేటర్ నిర్వాహకుల దోపిడి రోజు రోజుకి మితిమీరిపోతుంది. మొన్న చూస్తే దేవర సినిమా టికెట్ల పేరుతో థియేటర్ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేశారు. నేడు నీళ్లు తాగే (వాటర్ బాటిల్ పైన) కనీస ధర రూ.20లు ఉంటే రూ.30లు వసూలు చేస్తున్నారు. స్థానిక అధికారులు స్పందించి తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని సినిమా చూసేందుకు వచ్చిన అభిమానులు కోరుతున్నారు.

## బాప్టిస్ట్ చర్చి ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- 270 మంది రోగులకు వైద్య సేవలు
- సర్పంచ్ రమణమ్మ, కల్వరి బాప్టిస్ట్ చర్చి చారిటబుల్ ట్రస్ట్ పాస్టర్ సుధీర్ బాబు







**చింతపల్లి, అక్టోబర్ 8 (జనస్వరం) :** మండలంలోని కిటుముల పంచాయతీ పరిధిలోని చీమలపాడు గ్రామంలో మంగళవారం కల్వరి బాప్టిస్ట్ చర్చి ట్రస్ట్ చారిటబుల్ పాస్టర్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్న 270 మంది రోగులు ఉచిత మెగా వైద్య శిబిరానికి తరలివచ్చి వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిటుముల సర్పంచ్ గెమ్మెలి రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు వైద్య శిబిరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు చిన్నపాటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలివెళ్లి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఆస్పత్రిలో లభించే వైద్య సేవలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన లోపంతో ఎంతోమంది అనేక వ్యాధులతో బాధపడుతూ మృత్యువాత పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. కల్వరి బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఈ ప్రాంతీయులకు వరమని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి విశాఖపట్నం అపోలో హాస్పటల్ తో పాటు పాడేరు, మన్యం జిల్లా పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నిపుణులైన వైద్య అధికారులు విచ్చేసి వైద్య సేవలు హర్షించదగ్గ విషయమని, ఇటువంటి వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఆనంద్ మోహన్, రవి కిరణ్, పద్మజ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనము పోతురాజు, సుర్ల అప్పారావు, నాగరాజు, నర్సింగరావు, భాస్కరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

**బీజేపీ సీనియర్ నాయకులు, ప్రముఖ సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్**



**చీరాల, అక్టోబర్ 8 (జనస్వరం) :** దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, ప్రధానమంత్రిగా విశేష కృషి చేస్తున్న నరేంద్ర మోడీ ప్రజల గుండెల్లో నిలిచారని, బీజేపీ సీనియర్ నాయకులు, ప్రముఖ సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ అన్నారు. హర్యానా, జమ్మూ కాశ్మీర్ తదితర రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో, బీజేపీ విజయం సాధించటం పట్ల, చీరాల గడియార స్తంభం సెంటర్లో, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి పెడుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల, దేశ ప్రజలు మరోసారి విశ్వాసం ప్రదర్శించారన్నారు. హర్యానా రాష్ట్రంలో బీజేపీ, మూడోసారి అధికారంలోకి రావడం, ఆ రాష్ట్ర ప్రజలకు భారతీయ జనతా పార్టీ పై, ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాలుగా, ప్రజలకు నీతివంతమైనపాలన అందించినందుకు, ప్రజలు మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించారన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ఎన్ని రకాలుగా ప్రజలను మభ్యపెట్టినా, ప్రజలు మాత్రం బీజేపీ వైపే ఉన్నారన్నారు. జమ్ము కాశ్మీర్ ఎన్నికల్లో ఆర్టికల్ 370 తర్వాత, జరిగిన ప్రజాస్వామ్య ఎన్నికలలో బీజేపీ గణనీయమైన ఓటు శాతం సాధించిందని, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా రాబోయే రోజులలో, అధికారం కైవసం చేసుకునే దిశగా, జమ్ము కాశ్మీర్‌లో బీజేపీ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలు బీజేపీ ఆదరిస్తున్నారని, ఎక్కడ ఎన్నికలు జరిగినా, బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, రాబోవు రోజుల్లో తెలుగు రాష్ట్రంలో కూడా, బీజేపీ జెండాను ఎగరేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరవపల్లి కుమార్, మేడికొండ భరణీ రావు, నాగేశ్వరరావు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్డబ్ల్యూఎస్ ఏఈగా వర్మ, ఏవోగా ధామా వెంకటేశ్వరరావు

**దెందులూరు, అక్టోబర్ 8 (జనస్వరం) :** దెందులూరు మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈగా చింతమనేని వర్మ మంగళవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు దెందులూరు ఏఈగా పనిచేస్తున్న రాజేంద్ర ద్వారకాతిరుమల బదిలీపై వెళ్లారు. దెందులూరు మండలం వ్యవసాయ శాఖ ఇన్చార్జి అధికారిగా దామా వెంకటేశ్వరరావు విధుల్లో చేరారు.ఈయన కొవ్వలి అగ్రికల్చర్ ఫార్మ్ నుంచి బదిలీపై దెందులూరు ఇన్చార్జి ఏవో గా వచ్చారు.

## ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ



**తనకల్లు, అక్టోబర్ 8 (జనస్వరం) :** కొక్కంటి క్రాస్ బాలసముద్రంలో ఉన్న గౌరీ సమేత జంబులింగేశ్వర ఆలయంలో ఆలయ పురోహితులు మల్లికార్జున స్వామి ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అలాగే ఆ దేవదేవుని కృప మనందరిపై ఉండాలని ప్రార్థించారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211 REGD NO : APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.